## వేరుశనగ దిగుబడుల పెంపుపై ఇక్రిశాట్ దృష్టి

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 10 (నమస్తే తెలంగాణ): వేరుశనగ సాగులో ఫంగల్ సమస్యలకు చెక్ పెట్టి దిగుబడులను పెంచేందుకు ఇక్రిశాట్ కృషి చేస్తున్నది. దేశంలోని వివిధ శీతోష్ణ, భూసార పరిస్థితులను ఆధారంగా చేసుకుని అఫ్లోటాక్సిన్ (ఆస్పిరిజెల్లా)ను నియంత్రించేందుకు ప్రయత్నిస్తున్నది. అఫ్లోటాక్సిన్ క్యాన్సర్‌కు దారితీస్తుందని పరిశోధనలు స్పష్టం చేస్తుండటంతో ఆ ఫంగస్ సోకిన వేరుశనగ వినియోగాన్ని ఇప్పటికే కొన్ని దేశాలు పూర్తిగా నిషేధించగా, మరి కొన్ని దేశాలు కఠిన నిబంధనలను అమలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆస్పిరి జెల్లాను నియంత్రించగలిగితే వేరుశనగ దిగుబడితోపాటు రైతుల ఆదాయం కూడా పెరుగుతుందని, అందుకే ఆ సమస్యలపై దృష్టి సారించామని ఇక్రిశాట్ పరిశోధకులు వెల్లడించారు.

## రేపటి నుంచి మరో వందేభారత్ రైలు

హైదరాబాద్, మార్చి 10 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో మరో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలెక్కనున్నది. సికింద్రాబాద్-విశాఖపట్నం మధ్య నడిచే ఈ రైలును ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఈ నెల 12న ఉదయం 11.30 గంటలకు ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. పలు రైల్వే ప్రాజెక్టులను జాతికి అంకితం చేయనున్నారు. రోజూ ఉదయం 5.05 గంటలకు సికింద్రాబాద్ నుంచి బయలుదేరి మధ్యాహ్నం 1.50 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. తిరిగి మధ్యాహ్నం 2.35 గంటలకు విశాఖ నుంచి బయలుదేరి రాత్రి 11.20 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. మధ్యలో 5 చోట్ల ఆగుతుంది. వరంగల్, ఖమ్మం, విజయవాడ, రాజమండ్రి, సామర్లకోటలో స్టాపులు ఏర్పాటు చేశారు.

## 'స్టాన్‌ఫోర్డ్' కేస్ స్టడీగా హైదరాబాద్ మెట్రో

- ఆ వర్సిటీ విద్యార్థులకు మన మెట్రో విజయగాథ తెలుసుకునే అవకాశం
- ఇదొక అరుదైన గౌరవం: మెట్రో ఎండీ

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 10 (నమస్తే తెలంగాణ): ప్రపంచ ప్రఖ్యాత స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం మేనేజ్‌మెంట్ విద్యార్థులకు, ప్రాక్టీషనర్లకు.. హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టుల విజయగాథ ఒక కేస్ స్టడీగా మారిందని మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి పేర్కొన్నారు. విశ్వవిద్యాలయం వెలువరించే స్టాన్‌ఫోర్డ్ సోషల్ ఇన్నోవేషన్ రివ్యూ (ఎస్ఎస్ఐఆర్) తాజా సంచికలో ఈ అంశాన్ని ప్రచురించిందని ఆయన తెలిపారు. ఈ విషయమై ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇది ఒక భారతీయ మౌలిక వసతుల ప్రాజెక్టుకు దక్కిన అరుదైన గౌరవంగా ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్బీ) అభివర్ణించిందని తెలిపారు. ప్రపంచంలో చేపట్టిన పలు భారీ ప్రాజెక్టుల అమలులో ఎదురయ్యే అనేక సమస్యలు, వాటిని అధిగమించడానికి కావాల్సిన నాయకత్వ లక్షణాలు తదితర అంశాలపై తగిన సూచనలు, పరిష్కార మార్గాలను ఈ అధ్యయనం సూచిస్తున్నదని పేర్కొన్నారు. ఐఎస్బీ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ రామ్ నిడుమోలు, ఆయన బృందం హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుపై క్షుణ్ణంగా జరిపిన అధ్యయనాన్ని స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం కేస్ స్టడీగా ఎంచుకొన్నదని పేర్కొన్నారు. పీపీపీ (పబ్లిక్ ప్రైవేటు పార్టనర్‌షిప్) విధానంలో చేపట్టిన మెట్రో రైలు ప్రాజెక్టు విజయవంతం కావడంతో దీన్ని పరిగణనలోకి తీసుకున్నట్టు తెలిపారు. హైదరాబాద్ నగర విస్తరణలో మెట్రో రైలు కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు.

## సీపీఎస్ రద్దు హామీని నిలబెట్టుకోవాలి

హైదరాబాద్, మార్చి 10 (నమస్తే తెలంగాణ): న్యాయపరమైన చిక్కులు, కోర్టు ఆటంకాలను తొలగించి బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియను ప్రారంభించాలని టీఎస్ యూటీఎఫ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేస్తామన్న హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని కోరింది. టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ విస్తృత సమావేశాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను విడుదల చేయాలని కోరారు. జీవో-317తో తలెత్తిన ఉపాధ్యాయుల ఇబ్బందులను తొలగించాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి, ఉపాధ్యక్షులు సీహెచ్ రాములు, దుర్గాభవాని, కోశాధికారి లక్ష్మారెడ్డి, మాణిక్ రెడ్డి తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.














